ప్రశాంతంగా శోభాయాత్ర నిర్వహించాలి

- పోలీస్ కమిషనర్ అనురాధ
- పోలీసు అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్12: శాంతియుత, ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని సీపీ అనురాధ పోలీస్ అధికారులకు సూచించారు. గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులతో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్కిల్ వారీగా ఎన్ని వినాయకులు ఉన్నాయి ఎప్పుడెప్పుడు నిమజ్జన కార్యక్రమం ఉన్నది, చెరువులు, కుంటల వద్ద జరుగుతున్న ఏర్పాట్లు, బందోబస్తు తదితర అంశాలపై సంబంధిత ఏసీపీలను, ఇన్స్పెక్టర్లను, సీఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం జరిగే మూడు రోజులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మజీద్ వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రారావు, సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

హుస్నాబాద్, సెప్టెంబర్ 12: హుస్నాబాద్ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో వినాయక నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ వాసాల అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ పండుగ వాతావరణంలో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించాలన్నారు. నిమజ్జనం పండుగ వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా నిర్వహించాలి

కొమురవెల్లి, సెప్టెంబర్ 12 : గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు ప్రశాంతగా నిర్వహించాలని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. గురువారం కొమురవెల్లితో పాటు పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు జరిగే ప్రదేశాలను కొమురవెల్లి ఎస్సై రాజుగౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వినాయకులను నిమజ్జనాలు చేసే చెరువులు, కుంటల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి సూచించారు.

నిమజ్జన ఏర్పాట్లు.. చెరువుల పరిశీలన

హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్, సెప్టెంబర్ 12: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విగ్రహాల నిమజ్జన వేడుకలను భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపంలో గణపతి విగ్రహాల నిమజ్జనం చేసే ప్రదేశాన్ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విగ్రహాల నిమజ్జనం సమయంలో ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పున్న లావణ్యసది, వల్లపు రాజు, మున్సిపల్ ఏఈ పృథ్వి, సానిటరీ ఇన్స్పెక్టర్ బాలెల్లం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, సెప్టెంబర్ 12 : పట్టణంలో జరిగే వినాయక నిమజ్జనాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళిగుప్తా కోరారు. గురువారం గజ్వేల్‌లోని పాండవుల చెరువు వద్ద జరిగే నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. శోభాయాత్ర ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఆయా మండపాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు.

గజ్వేల్ : పాండవుల చెరువువద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..

చర్చి పాస్టర్ మత్తయి భార్య సువార్త మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 12 : అధైర్యపడొద్దు అండగా ఉంటానని పలు కుటుంబాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. గురువారం సిద్దిపేట నియోజకవర్గంలో పలు కుటుంబాలను పరామర్శించారు. చిన్న గుండవెళ్లికి చెందిన కోటగిరి మహేశ్ గౌడ్ అనారోగ్యంతోబాధపడుతూ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. పట్టణంలోని లింగారెడ్డిపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు హైకోర్టు న్యాయవాది ప్రతాప్‌రెడ్డి మాతృమూర్తి వంగ రాజవ్వ మృతి చెందగా ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. 24వ వార్డుకు చెందిన వీరబత్తిని జనార్దన్ తండ్రి భూమయ్య మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. 3వ వార్డుకు చెందిన చర్చి పాస్టర్ మత్తయి భార్య సువార్త చనిపోగా ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పాల సాయిరాం, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సీనియర్ నాయకులు నారాగౌడ్, మాజీ సర్పంచ్ రామస్వామి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్ వర్మ, మాజీ ఎంపీటీసీలు రంగయ్య, బాలయ్య తదితరులు ఉన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే పల్లా హామీ

మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డికి సమస్యలను వివరిస్తున్న అధ్యాపకులు

మద్దూరు (ధూళిమిట్ట), సెప్టెంబర్ 12: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై గురువారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికతో పాటు వివిధ పత్రికల్లో వచ్చిన కథనానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పందించారు.కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ నిచ్చారు. కళాశాలను సందర్శించి సమస్యలు తెలుసుకోవాలని మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. మాజీ ఎంపీపీ పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి జూనియర్ కళాశాలను సందర్శించి కళాశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కళాశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కలెక్టర్‌కు ప్రత్యేకంగా లెటర్ రాయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయని పక్షంలో ఎమ్మెల్యే సొంత ఖర్చులతో 15 రోజుల వ్యవధిలోనే మరుగుదొడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, నాయకులు నల్ల బాల్‌రెడ్డి, బొద్దుల చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక

మండల కమిటీ అధ్యక్షుడికి బాధ్యతలు అప్పగిస్తున్న జిల్లా నాయకులు

చేర్యాల, సెప్టెంబర్ 12 : పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా వెంకట నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ధర్మారెడ్డి, అసోసియేట్ కార్యదర్శిగా వేణు, కార్యదర్శిగా శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగామమత, మహిళా కార్యదర్శిగా అరుణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, వెంకటరాజం, మద్దూరు మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ మండల అధ్యక్షుడు వేమారెడ్డి, ఆశ లక్ష్మణ్, కరుణాకర్, తిరుపతిరెడ్డి, ఆయిల్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, రాజేశం, వరదరాజు, రామకృష్ణ, పీఆర్‌టీయూ మండల సభ్యులు పాల్గొన్నారు.

చేతి రాతతో తలరాతను మార్చుకోవచ్చు

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

నారాయణరావుపేట, సెప్టెంబర్ 12 : అందమైన చేతిరాత ద్వారా తలరాతను మార్చుకునే శక్తి విద్యార్థులకు ఉందని డీఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 180 మంది విద్యార్థులకు చేతిరాత నోటు పుస్తకాలు, డ్రాయింగ్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. అక్షరాలు గుండ్రంగా రాయడం ద్వారా మంచి మార్కులు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో హెచ్ ఎంలు నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులతో ఆర్డీవోల సమావేశం

భూనిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో బన్సీలాల్

గజ్వేల్, సెప్టెంబర్ 12: మల్లన్నసాగర్ ముంపు గ్రామాల భూనిర్వాసితులతో గజ్వేల్, సిద్దిపేట ఆర్డీవోలు బన్సీలాల్, సదానందం ఐవోసీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భూనిర్వాసితులు తాత్కాలికంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లల్లో నివాసం ఉంటున్న వారిని పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడారు. నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్యాకెజీలు, పరిహారంపై ప్రధానంగా వారితో అధికారులు చర్చించారు. త్వరగా డబుల్‌బెడ్ రూం ఇండ్లను ఖాళీ చేస్తే పట్టణానికి చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని అందుకు అధికారులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో భూనిర్వాసితులతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు అరెస్టు అప్రజాస్వామికం

బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబర్ 12: ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ప్రశ్నించే గొంతుకలను అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బీఫాంపై గెలిచిన ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామాలు చేసి ప్రజాక్షేత్రంలో దమ్ముంటే పోటీ చేయాలన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వేసిన సవాల్‌ను స్వీకరించక ఆయన ఇంటిపై రాడ్లు, కంకర రాళ్లు, టమాట, గుడ్లతో ఇల్లు ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. దాడి చేసిన ఎమ్మెల్యే అరికేపుడి గాంధీ, అతని అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేయని పక్షంలో కమిషనరేట్ ముందు నిరసన తెలుపుతున్న హరీశ్‌రావును అరెస్టు చేయడం అప్రజాస్వామికం అన్నారు. కాంగ్రెస్ నాయకులు గుండాలు, రౌడీలుగా దాడులకు పాల్పడాన్ని తీవ్రంగా ఖండించారు.

రాష్ట్రంలో నియంత పాలన

దుబ్బాక, సెప్టెంబర్ 12: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పాలనను కొనసాగిస్తుందని, ఇందుకు నిదర్శనమే మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అక్రమ అరెస్టు అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కోమటిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి విరుచుకుపడ్డారు. గురువారం రాత్రి ఆయన మాట్లాడుతూ... కేవలం బీఆర్ఎస్ నాయకులను వేధించడమే పనిగా సీఎం రేవంత్‌రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. న్యాయపరంగా పోరాటం చేస్తున్న హరీశ్‌రావును పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా ఆయనపై దౌర్జన్యాన్ని ప్రదర్శించడం హేయనీయమైన చర్యగా పేర్కొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చేర్యాల, సెప్టెంబర్ 12 : హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు ఆయన ఇంటిని ధ్వంసం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు ఆయన అనుచరులపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి వెనుక సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర కోణం ఉందన్నారు. దమ్ముంటే పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో గెలిపించుకోవాలని డిమాండ్ చేశారు.

దాడి హేయమైన చర్య

జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 12: హైదరాబాద్‌లోని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా కార్యదర్శి ముచ్చపతి బాలయ్య అన్నారు. గాంధీ తన అనుచరులను సహచర ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయించడం విచారకరమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఎమ్మెల్యేలకే రక్షణ లేకుంటే సామాన్యులకు ఎలా రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి నాయకుల ఆగడాలను అరికట్టాలని లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని సూచించారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు12: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తీవ్రమైన వరదలు రావడంతో పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ సిద్దిపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ.. భారీ వర్షాలతో అపారమైన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం రాష్ట్రంలో పర్యటించి వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి నష్టానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అండర్-15 హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

అండర్ 15 హ్యాండ్‌బాల్ సెలక్షన్‌కు హాజరైన క్రీడాకారులు

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 12 : కుకునూరుపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోషియేషన్ అండర్-15 బాలుర క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట హ్యాండ్ బాల్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం, పాఠశాల పీడీ కాయతం రాజుకుమార్ మాట్లాడుతూ.. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి రెండు రోజుల పాటు హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు మాజీ సర్పంచ్ పోల్కంపల్లి జయంతీన రేందర్ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బచ్చలి సత్తయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా హ్యాండ్‌బాల్ అసోషియేషన్ సభ్యులు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలి

భక్తులకు స్టీల్ టిఫిన్ బాక్సు, లడ్డూ అందచేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబర్ 12: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. గురువారం మండలంలోని పందిల్లలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీ5 టౌన్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లడ్డూ ఫర్ ఆల్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో నవరాత్రి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులందరికీ స్టీల్ టిఫిన్ బాక్సు, లడ్డును అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోడేటి రమేశ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యయే కేంద్రం లక్ష్యం

విద్యార్థులు ఏర్పాటుచేసిన చిత్రపటాలను తిలకిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

వర్గల్, సెప్టెంబర్ 12 : గుణాత్మక విద్యయే కేంద్రం లక్ష్యమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం వర్గల్ నవోదయ విద్యాలయ సమితిలో ఏర్పాటు చేసిన యూత్ పార్లమెంట్ కాంపిటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. నవోదయ విద్యార్థులు ఏర్పాటు చేసిన చిత్రపటాలను ఎంపీ తిలకించారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సంస్థల హైదరాబాద్ రీజినల్ ప్రిన్సిపాల్ రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత సారస్వత ఎన్నికల్లో సమగ్ర శిక్షా అభియాన ఉద్యోగులను క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పేస్కేల్ ఇస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డ్యాగ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీ రఘునందన్‌రావును కలిసి వినతి పత్రం అందజేవారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దుండిగల్ యాదగిరి తోపాటు సీఆర్‌పీలు పాల్గొన్నారు.

రేపు గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

చేర్యాల, సెప్టెంబర్ 12 : జిల్లాలోని గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు చేర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో బాలురకు ఈ నెల 14న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు చేర్యాల గురుకుల ప్రిన్సిపాల్, గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ అశోక్‌బాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అల్వాల్, చేర్యాల, గుర్రాలగొంది, దుబ్బాక, హుస్నాబాద్, కోహెడ, దుద్దెడ, ప్రజ్ఞాపూర్‌లోని బాలుర సంక్షేమ గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం (ఇంగ్లిష్ మీడియం)లో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. హుస్నాబాద్, చౌదరిపల్లి, కొండపాక, రామక్కపేట, ఎన్సాన్‌పల్లి, తోగుటలోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను ఎన్సాన్‌పల్లిలో బాలికలకు స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో స్పాట్‌కు హాజరు కావాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

చేర్యాల, సెప్టెంబర్ 12 : మండల పరిధిలోని ఆకునూరులో బొగ్గు తిరుపతి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 18క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చేర్యాల పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ.. గామాల్లో ప్రజలు ఇసుక, బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే 8712667445 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి మృతి

వెంకట్‌రెడ్డి(ఫైల్)

వర్గల్, సెప్టెంబర్ 12 : మండల పరిధిలోని నెంటూర్ గ్రామ సీనియర్ రాజకీయ నాయకుడు వంటేరు వెంకట్‌రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎంపీపీలు రంగారెడ్డి, మోహన్, లతారమేశ్‌గౌడ్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు లక్ష్మారెడ్డి, రాఘవరెడ్డి, కొండల్‌గౌడ్, సాదుల్లాగౌడ్ తదితరులు వెంకట్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసు నమోదు

చేర్యాల, సెప్టెంబర్ 12 : మండలంలోని వేచరేణి గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు కొమురవెల్లి ఎస్సై రాజు సిబ్బందితో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వల్లపు వెంకటేశ్, మదాసు రమేశ్ కొనసాగిస్తున్న బెల్ట్‌షాపుల నుంచి మద్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేయడంతో పాటు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చాట్లపల్లి పాఠశాలలో మందుబాబుల ఆగడాలు

జగదేవపూర్, సెప్టెంబర్ 12 : మండల పరిధిలోని చాట్లపల్లి ఉన్నత పాఠశాలలో మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయని హెచ్ఎం మాధవరెడ్డి తెలిపారు. పాఠశాల మూసివేసిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి చేరి సిగరెట్లు, మందు బీర్లు తాగి వాటిని పగులగొట్టి తరగతి గదుల పద్ద వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గామస్తులు, విద్యార్థుల తల్లితండ్రులు చొరవ చూపి పాఠశాలలో మద్యం తాగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

పీఆర్‌టీయూ నూతన అధ్యక్షుడికి సన్మానం

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మర్కుక్, సెప్టెంబర్ 12 : పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావును బీఆర్ఎస్ నేత, మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మీసేవా నిర్వాహకులు సతీశ్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గజ్వేల్, సెప్టెంబర్ 12 : గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంగుపల్లి శివారులో గురువారం టాస్క్‌ఫోర్స్, పోలీస్ బృందం పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5100 నగదు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

బెజ్జంకి, సెప్టెంబర్ 12: మండల కేంద్రం తోపాటు, దాచారం, గుగ్గిళ్ల, గాగిల్లాపూర్, తోటపల్లి, వీరాపూర్, బేగంపేట, వడ్లూర్ పాఠశాలల్లో గురువారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రవీందర్, సతీశ్‌కుమార్, రాములు, శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్ల హద్దురాళ్లు తొలిగింపు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 12 : మండల పరిధిలోని నాంచార్‌పల్లి, పొన్నాల గ్రామాల్లో అక్రమ వెంచర్ల హద్దురాళ్లను తొలిగించినట్లు టౌన్ ప్లానింగ్ అధికారి దేవరాజ్ తెలిపారు. సుడా వైస్ చైర్మన్ అశిత్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం రెండు గ్రామాల్లో ఉన్న అక్రమ వెంచర్ హద్దురాళ్లను తొలిగించినట్లు తెలిపారు. సుడా పరిధిలో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో ఎలాంటి నిర్మాణాలు, వెంచర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్లు అర్హులకే ఇవ్వాలి

దుబ్బాక, సెప్టెంబర్ 12 : మండల పరిధిలోని బల్వంతాపూర్‌లో 20 డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించారు. ఇప్పటివరకు ఆ వాటిని ఎవరికీ కేటాయించ లేదు. కొందరు ఆ ఇండ్లలో నివసిస్తున్నారు.